మండల అభివృద్ధికి సహకరిస్తా : ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధర్మరాజును అభినందిస్తున్న ఎంపిపి, సర్పంచి

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజును ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, నాచుగుంట సర్పంచి ఏలేటి సునీత మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మండలం, గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించి అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలంతా మెచ్చేవిధంగా పరిపాలన అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గంటా సుబ్బారావు, ఏలేటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నిమ్మలకు ఇరిగేషన్..
కొలుసుకు గృహ, సమాచార శాఖలు

ప్రధాన శాఖలు జిల్లాకు దక్కడంపై అంతటా హర్షం

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు గాడిన పడేనా

పోలవరం, చింతలపూడి, తాడిపూడి పూర్తిపై అంతా ఆశలు

డెల్టా ఆధునికీకరణ పనులు పట్టాలెక్కేనా

పేదల సొంతింటి కల నెరవేరేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాకు ప్రధానమైన మంత్రిత్వ శాఖలు దక్కడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 12న మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి సిఎం చంద్రబాబు శుక్రవారం శాఖలు కేటాయించారు. పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి పదవి దక్కించుకున్న పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకి జలవనరులశాఖ (ఇరిగేషన్) కేటాయించారు. ఏలూరు జిల్లాలో మంత్రిపదవి దక్కిన నూజివీడు ఎంఎల్ఎ కొలుసు పార్థసారధికి గృహనిర్మాణం, సమాచార శాఖలు కేటాయించారు. ఇరిగేషన్, గృహనిర్మాణ శాఖలు ప్రధానమైనవి కావడంతో జిల్లాకు మేలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖ దక్కిన నిమ్మల రామానాయుడు ఎంఎల్ఎ కాకముందు రైతు నేతగా పని చేశారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, డెల్టా ఆధునికీకరణపై అవగాహన ఉంది. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు, వైసిపి ప్రభుత్వంలోనూ ఆయన డెల్టా ఆధునికీకరణ పనులపై అనేక ఆందోళనలు చేయడంతోపాటు జిల్లా సమీక్షా సమావేశాల్లో గట్టిగా మాట్లాడిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు నిమ్మల ఇరిగేషన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ పట్టేనా అనే చర్చ సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 29 మండలాల్లో డెల్టా ప్రాంతం విస్తరించి ఉంది. 2007లో డెల్టా ఆధునికీకరణ కోసం అప్పటి ప్రభుత్వం రూ.1400 కోట్లు వరకూ కేటాయించింది. దశాబ్దన్నర కాలం గడిచినా ఇప్పటికీ డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తి కాలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆధునికీకరణ పనులు పూర్తిగా పడకేశాయి. ఇంకా దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర పనులు చేయాల్సి ఉంది. కాలువలు ఎక్కడికక్కడే మెరకతేరిపోయాయి. లాకులు పాడైపోయాయి. దీంతో ప్రతియేటా భారీవర్షాలకు రైతులు వేల ఎకరాల్లో పంటను నష్టపోతున్నారు. ఇరిగేషన్ శాఖ జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడుకు దక్కడంతో డెల్టా ఆధునికీకరణ పనులు వేగంగా జరిగే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు పోలవరం, చింతలపూడి, తాడిపూడి ఉన్నాయి. పోలవరం పూర్తి బాధ్యత కేంద్రానిది కావడంతో ఆ పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. ఏలూరు, కృష్ణా జిల్లాల్లో నాలుగు లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందించే చింతలపూడి ప్రాజెక్టు పనులు వైసిపి ప్రభుత్వ హయాంలో పడకేశాయి. రూ.4,909 కోట్ల ప్రాతిపాదనలతో రూపొందించిన చింతలపూడికి మరో రూ.1500 కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే అవకాశం ఉంది. ఇది పూర్తయితే జిల్లాలోని మెట్టప్రాంతానికి పుష్కలంగా సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిమ్మల కృషి చేయాలని అంతా ఆశిస్తున్నారు. అదేవిధంగా తాడిపూడి ఎత్తిపోతల పథకం పిల్ల కాలువల పనులు పూర్తి చేస్తే దాదాపు మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఆ పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించాలని అంతా కోరుతున్నారు. ఏం జరుగుతుందో వేచిచూడాలి.

పేదల సొంతింటి కల నెరవేరేనా..

గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా కొలుసు పార్థసారధికి అవకాశం దక్కింది. ఆయన సీనియర్ నాయకుడు. వైసిపి ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించినప్పటికీ ఇళ్ల నిర్మాణంలో మాత్రం వెనుబడింది. దీంతో పేదల సొంతింటి కల నెరవేరకుండా పోయింది. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఇళ్ల నిర్మాణం కావాల్సి ఉండగా 25 వేల ఇళ్లుకూడా పూర్తికాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని పేదలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు పార్థసారధి కృషి చేయాలని అంతా కోరుతున్నారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో మండల విలేకరులకు ఇచ్చే అక్రిడిటేషన్లలో కోత విధించారు. చాలామంది అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు దక్కలేదు. అర్హులైన ప్రతి మండల విలేకరికీ అక్రిడిటేషన్లు ఇచ్చేలా మంత్రి పార్థసారధి చర్యలు తీసుకోవాలని అంతా కోరుకుంటున్నారు. అంతేకాకుండా జర్నలిస్టులకు ఇంటి స్థలం తీరని కలగా మారింది. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి

గ్రీవెన్స్‌లో సమస్యలు వింటున్న ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సిబ్బంది వ్యక్తిగత భద్రత, వారి సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం పోలీసు సిబ్బంది గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి పోలీసు సిబ్బంది, హోంగార్డుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మేరీప్రశాంతి మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే కృషి చేస్తున్నామన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. సిబ్బంది, హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది ఎవరికైనా ఏమైనా సమస్యలుంటే గ్రీవెన్స్ డేతో సంబంధం లేకుండా తనను నేరుగా కలిసి తనకు తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధాన్యం బకాయిల సొమ్ము వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం సొమ్ములివ్వకపోతే సార్వా సాగు చేయలేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు, కౌలు రైతులు రబీ ధాన్యం అమ్మి 40 రోజులు దాటిపోతున్నా సొమ్ము ఇంకా చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు మాత్రం రెండు, మూడు రోజులకే ధాన్యం సొమ్ము చెల్లించి, ఎన్నికల అనంతరం పౌర సరఫరాల శాఖ చేతులెత్తేయడం దుర్మార్గమని విమర్శించారు. కొత్త ప్రభుత్వం వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించి రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయి సొమ్మును వెంటనే వారికి చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే అన్నదాతలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు రూ.240 కోట్లు ధాన్యం బకాయి సొమ్ము రైతులకు, కౌలు రైతులకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో విత్తనాల కొనుగోలుకూ చేతిలో సొమ్ము లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత పంట అప్పులు చెల్లించకపోవడంతో ఖరీఫ్ సాగుకు అప్పు దొరికే పరిస్థితి లేదని తెలిపారు. కొత్త ప్రభుత్వం ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు నిర్వహించే ఆందోళనకు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని ప్రకటించారు.

కానుకొల్లులో చెరువు వివాద భూమి పరిశీలన

కానుకొల్లులో పొలాన్ని పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారుల బృందం

ప్రజాశక్తి - మండవల్లి

పొలాన్ని రొయ్యల చెరువుగా మార్చాలని భూయజమాని, తాగునీటి వనరులు దెబ్బతింటాయని కాలనీవాసుల మధ్య కానుకొల్లులో నెలకొన్న వివాదంపై పరిశీలనా నివేదికను ఫిషరీస్ కమిషనర్‌కు అందజేస్తామని ఆ శాఖ ఎడి భాషా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కానుకొల్లులోని పొలాన్ని వివిధ శాఖల అధికారులతో కూడిన బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ కానుకొల్లుకు చెందిన పుట్టి సత్యనారాయణ కాలనీ వెనుక ఉన్న పొలాన్ని రొయ్యల చెరువుగా మార్చేందుకు సిద్ధమయ్యారు. దీనిపై కాలనీవాసులు ఆ భూమిలో రొయ్యల చెరువు తవ్వితే తాగునీటి వనరులు దెబ్బతింటాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో సమస్యను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోర్టు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. అయితే ఆ భూమి ఆక్వా జోన్ పరిధిలో లేదని కలెక్టర్ కోర్టుకు తెలిపారు. దీంతో పుట్టి సత్యనారాయణ మళ్లీ కోర్టును ఆశ్రయించాడు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఫిషరీస్ కమిషనర్‌ను కోర్టు ఆదేశించింది. ఫిషరీస్ కమిషనర్ ఆదేశాలతో డిఎఫ్ఒ నాగలింగాచార్యులు పర్యవేక్షణలో ఇరిగేషన్, అగ్రికల్చర్, పొల్యూషన్, గ్రౌండ్‌వాటర్, రెవెన్యూ శాఖల అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ బృందం కానుకొల్లులో పొలాన్ని శుక్రవారం పరిశీలించింది. దీనిపై నివేదికను ఫిషరీస్ కమిషనర్‌కు అందజేస్తామని ఎడి భాషా తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ గోపాల్, వ్యవసాయాధికారి జరీనా, ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసరావు, ఎఫ్‌డిఒ కిషోర్, విఆర్ఒ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎఫ్‌ను తెరిపించండి

ఉంగుటూరు ఎంఎల్ఎకు కార్మికుల వినతి

ప్రజాశక్తి - గణపవరం

ఎంఎల్ఎ ధర్మరాజుతో సిపిఎఫ్ ఫ్యాక్టరీ కార్మికులు

మండలంలో సరిపల్లి గ్రామంలోని సిపిఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఆ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు ఎనిమిది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోవడంతో మీరైనా మా సమస్య పరిష్కరించండి అంటూ ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజును కోరారు. కార్మికులు శుక్రవారం ఫత్తేపురంలో ఎంఎల్ఎను కలిసి తమ సమస్య వివరించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భీమవరంలో జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావుకు కూడా కార్మికులు వినతిపత్రం అందించి తమ పరిశ్రమ తెరిపించాలని కోరారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

లేకుంటే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చంటి, ప్రభాకరరావు

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

ప్రజాశక్తి - కామవరపుకోట

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.చంటి, అందుగుల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని రామన్నపాలెం, ఉప్పలపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో శుక్రవారం వారు పర్యటించారు. చెరువులో పని చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.చంటి మాట్లాడుతూ రామన్నపాలెం, ఉప్పలపాడు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్ నెల నుంచి ఇప్పటివరకు రోజువారి వేతన కూలి ఎంత పడుతుందో తెలిపే పే స్లిప్పులు ఇవ్వలేదన్నారు. తక్షణమే కూలీలకు పే స్లిప్పులు అందించాలని మండల ఎపిఒను డిమాండ్ చేశారు. గత మూడు నెలల నుంచి కూలీలు పని చేస్తున్నప్పటికీ వేతన బకాయిలు రూ.లక్ష ఉన్నాయని, వేతనాలు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేతనాలు విడుదల చేయాలని పలుమార్లు అధికారులకు దరఖాస్తులు పెట్టినప్పటికీ కూలీలను చిన్న చూపు చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మండలంలో గతంలో పలు గ్రామాల్లో పర్యటించామన్నారు. అన్ని గ్రామాల్లో పని కావాలని కూలీలు అడుగుతున్నప్పటికీ పని చూపించటంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. జాబ్‌కార్డులు ఇవ్వాలని ఇప్పటికే పలుమార్లు కూలీలు దరఖాస్తులు పెట్టినప్పటికీ ఏ ఒక్కరికీ జాబ్ కార్డులు ఇవ్వకపోవటాన్ని తీవ్రంగా ఖండించారు. ఉపాధి హామీ చట్టంలో 15 రోజులకోసారి వేతన బకాయిలు విడుదల చేయాలని, అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు, కూలీలకు ప్రతి వారం పే స్లిప్పులు ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఎంపిడిఒ స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే మండలంలోని ఉపాధి హామీ కూలీలందరిని ఐక్యం చేసి ఎంపిడిఒ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

జీలుగుమిల్లి : ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు దానియేలు, నాగదుర్గ కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ కెఎం.మంగతాయారుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే ఇవ్వాలని, రెండు ఫొటోల విధానాన్ని రద్దు చేయాలని, కనీస సదుపాయాలైన తాగునీరు, మజ్జిగ, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతి కుటుంబానికీ ఉపాధి పని చూపాలని, జాబ్ కార్డు లేని వారిని గుర్తించి వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని, కూలి రూ.600 ఇవ్వాలని కోరారు.

జలవనరుల శాఖ కేటాయింపుపై నిమ్మల హర్షం

చంద్రబాబు, పవన్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో కీలకమైన జల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించినందుకు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు మంత్రి నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు అమరావతిలో ఆయన సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతాంగానికి సేవలందించే బాధ్యతను అప్పగించినందుకు రైతు బిడ్డగా ఎంతో ఆనందపడుతున్నానన్నారు. రాష్ట్ర మంత్రిగా అవకాశం రావడానికి తనను మూడోసారి ఎంఎల్ఏగా ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని చెప్పారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

డిఇఒ అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న డిఇఒ, ఎంఎల్ఎ

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని డిఇఒ అబ్రహం అన్నారు. స్థానిక 11వ డివిజన్‌లోని కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థినులకు ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ అబ్రహం మాట్లాడుతూ ఆడపిల్లలకు కస్తూరిబా పాఠశాలలో ఉన్న సౌకర్యాలు మరే స్కూలులో ఉండవన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులందరూ అదృష్టవంతులన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే, భవిష్యత్తులో మంచి స్థానం, ఉద్యోగం రావాలంటే విద్యార్థి దశ నుంచే బాగా చదవాలన్నారు. ప్రతి విద్యార్థి కూడా ఒక ప్లాన్‌తో స్కూల్ ప్రారంభించిన రోజు నుంచే చదవడం ప్రారంభిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి కూడా రోజుకు నాలుగు గంటల చొప్పున చదివితే భవిష్యత్తులో చాలా ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. ఈ రోజుల్లో ఆడపిల్లలను చదివించే తల్లిదండ్రులు చాలా గొప్పవారన్నారు. ఏలూరు జిల్లాలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ ప్రారంభమైందన్నారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు 28 మండలాల్లో ఉన్న పాఠశాలలన్నిటికీ పంపిణీ చేశామన్నారు. బడేటి చంటి మాట్లాడుతూ విద్యార్థులను ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తారని, వారు బాగా చదివేలా ప్రతి ఉపాధ్యాయుడు తీర్చిదిద్దాలని కోరారు. చదువు వల్ల సభ్యత సంస్కారం వస్తాయన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. రోజుకు 24 గంటలు కష్టపడడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అనంతరం వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ రవిప్రకాష్, ఎపిసి సోమశేఖర్, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

సామాజిక వైద్యుడు చే గువేరా

జయంతి వేడుకలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు

ప్రజాశక్తి - ఏలూరు



చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరసింహారావు, తదితరులు

డాక్టర్ చదివిన చేగువేరా సమాజానికి వైద్యం చేయడం కోసం ప్రయత్నించిన సామాజిక వైద్యులని, అమెరికా వ్యతిరేక స్వాతంత్ర పోరాటాలకు ఆయన ప్రేరణ కలిగించారని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహించిన చేగువేరా 96వ జయంతి కార్యక్రమానికి కంప్యూటర్ ప్రిన్సిపల్ ఎంఎస్ఎన్.లక్ష్మి స్వాగతం పలికి అధ్యక్షత వహించారు. చేగువేరా చిత్రపటానికి గుడిపాటి నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. హాజరైన కంప్యూటర్ శిక్షణ కేంద్రం విద్యార్థులందరూ చేగువేరాకు జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ 1928లో అర్జెంటైనాలో జన్మించిన చేగువేరా మెడిసిన్ చదివారన్నారు. దక్షిణ అమెరికాలో ప్రజల పరిస్థితులను, అమెరికా పెత్తనాన్ని మోటార్ బైక్ ద్వారా సందర్శించి అమెరికా వ్యతిరేక పోరాటానికి పూనుకున్నారన్నారు. అమెరికాకు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్యూబాలో కాస్ట్రోతో కలిసి తిరుగుబాటు చేసి దేశాన్ని విముక్తి చేయడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఆర్థిక మంత్రిగా ప్రపంచ దేశాల మద్దతుతో క్యూబా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. భారతదేశంలో ఢిల్లీకి, కలకత్తా కూడా వచ్చి మద్దతు కోరారని తెలిపారు. ప్రపంచంలో పంచదార ఉత్పత్తిలో, వైద్య రంగాల్లో, బాక్సింగ్ రంగంలో క్యూబా ఎంతో అభివృద్ధి చెందిందని, అందుకు చేగువేరా వేసిన పునాది తోడ్పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయి సిద్ధార్థ, లక్ష్మణరావు, హారిక, వాసవి, రేష్మ, విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, విజయ్‌కృష్ణ, ప్రవీణ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మమత హాస్పిటల్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో మమత హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో నవభారత్ కంపెనీ లిమిటెడ్ ఎంప్లాయిస్, కార్మికులు స్వచ్ఛందంగా సుమారు 20 మందికి పైగా రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం తమ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. రోజురోజుకి తలసేమియా వ్యాధిగ్రస్తులు ఎక్కువ అవుతున్నందున తమ హాస్పిటల్‌లో తలసేమియా రోగుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. నవభారత్ కంపెనీ ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో అనేకమంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తలసేమియా రోగులు కోసం తమ వంతు సాయం చేయాలని కోరారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేసిన నవభారత్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగులకు, కార్మికులకు మమత హాస్పిటల్ యాజమాన్యం వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

కైకరం జిల్లా పరిషత్ హైస్కూలులో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ తదితర పోటీలు నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవర్చుకోవటం-వ్యర్థాలను తగ్గించడం అంశంపై పోటీలు నిర్వహించామని హెచ్ఎం ప్రసాదరావు చెప్పారు. సైన్స్ ఉపాధ్యాయుడు బగాది సీతారాములు ఆధ్వర్యంలో నిర్వహించారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా వేసవిలో అక్రమార్కులు మట్టి అక్రమ తవ్వకాల వ్యాపారం చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. వేసవి వచ్చిందంటే మట్టి మాఫియాకు పండగే పండుగ. అలాంటిది ఈ ఏటా వేసవిలో సార్వత్రిక ఎన్నికలు రావడం, ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో గత రెండు నెలలుగా మండలంలోని అక్రమ మట్టి తవ్వకాలకు బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మట్టి తవ్వకాలు చేసే వారి విషయంలో రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించారు. అంతేకాకుండా ఒకటి, రెండు చోట్ల తవ్వకాలు చేపట్టిన మట్టి మాఫియాపై కేసులు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్లను, జెసిబిలను సీజ్ చేశారు. దీంతో మట్టి తవ్వకాలు, మట్టి మాఫియా ఆగడాలు నిలిచిపోయాయి. రెండు నెలలపైగా మట్టి తవ్వకాలు లేక ఖాళీగా ఉన్న మట్టి మాఫియా ఎన్నికల ఫలితాలు వెలువడిన మరిసటి రోజు నుంచే మండలంలో మట్టి అక్రమ తవ్వకాలకు తెర లేపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

గ్రామాల్లో దర్జాగా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లలో, లారీల్లో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి బడాబాబులు రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు మండల వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. పంట భూములు, పంట కాలవ గట్లు, డ్రెయినేజీ గట్లు, మెరక తీసే పేరుతో పంట పొలాలను తవ్వేస్తూ తెల్ల బంగారాన్ని, నల్ల బంగారాన్ని సైతం జెసిబిలతో తొలగిస్తూ లారీల్లో, ట్రాక్టర్లల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. దూరాన్ని బట్టి ట్రక్కు మట్టి రూ.1,500, టిప్పర్ మట్టి రూ.6 నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు ముడుపుల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధిక లోడుతో రహదారులపై టిప్పర్లు, ట్రాక్టర్లు అతివేగంతో వెళ్తున్నా పోలీసులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరించడంపై పలు అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అప్పారావుపేట, వడాలి, చిగురుకోట, పెదగొన్నూరు, అల్లూరు, కొరగుంటపాలెం, బొమ్మినంపాడు తదితర గ్రామాల్లో ఈ మట్టి అక్రమ తవ్వకాలు, తోలకాలు యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజల ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు, తోలకాలను నిలుపుదల చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో అధికారులను కోరుతున్నారు.

డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గ్రామాల్లో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పట్టిసీమ, గూటాల వంటి గ్రామాల్లో వర్షాలు పడినప్పుడు రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. డ్రెయినేజీలు, రోడ్లు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే అన్ని గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కల్పనకు కూటమి అడుగులు

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా టిడిపి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. టిడిపి కూటమి రాష్ట్ర ప్రజలకు ఏ విధమైన వాగ్దానం చేసిందో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి ప్రాతిపదికన కల్పిస్తామని చెప్పారో మొదటి ప్రాధాన్యతతో సిఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మూడింటికి తగ్గట్టుగా ఐదు సంతకాలు చేశారన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అత్యంత విశ్వాసంతో టిడిపి కూటమిని గెలిపించారని, ఆ నమ్మకం, విశ్వాసం ప్రజల్లో నిలుపుకునే విధంగా చంద్రబాబు పని చేస్తారని చెప్పారు. మంత్రి పదవులు అనుభవజ్ఞులైన నాయకులకు ఇచ్చి అమరావతిని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే దిశగా కొనసాగిస్తున్నారన్నారు. నారా లోకేష్ ఐటి రంగాన్ని ఇచ్చి ఉద్యోగ అవకాశాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, విజయలక్ష్మి పాల్గొన్నారు.


ఆర్ఒ ప్లాంటును పున:ప్రారంభిస్తున్న సర్పంచి అలకనంద

ఆర్ఒ ప్లాంట్ పున:ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సచివాలయం-2 పరిధిలో రక్షిత తాగునీటి ప్లాంటును సర్పంచి దిడ్ల అలకనంద శుక్రవారం పున:ప్రారంభించారు. ఇప్పటివరకు వైసిపి నాయకుల ఆధీనంలో ఉన్న ఈ ప్లాంట్‌ను టిడిపి నాయకులు స్వాధీనం చేసుకుని ఆర్ఒ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను పంచాయతీ తీసుకుంది. ప్లాంట్ వద్ద నీటిని పంపిణీ చేయడం, కరెంట్ బిల్లు కట్టుకోవడం, ఆర్ఒ ప్లాంగ్ ఫిల్టర్స్ మరమ్మతులు తదితర ప్రక్రియ టిడిపి సానుభూతిపరులకు అప్పగించగా, ప్లాంట్‌కు తాగునీరు బోరు నిర్వహణ, మరమ్మతుల వ్యవహారాన్ని పంచాయతీ నిధులతో చేసేలా ఒప్పందం కుదిరింది. టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సప్ప వీరబాబు, నాయకులు నల్ల ఆనంద్, పాతూరి సత్యనారాయణ, పోలయ్య, యువరాజ్ పాల్గొన్నారు.

సత్యప్రసాద్‌కు విఆర్ఒల సంఘం శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న అనగాని సత్యప్రసాద్‌కు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ పక్షాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. త్వరలోనే రెవెన్యూ మంత్రిని కలిసి రాష్ట్రంలో విఆర్ఒలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మెగా డిఎస్‌సిపై హర్షం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నికల వాగ్దానంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేయడం పట్ల తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా మెగా డిఎస్‌సి కోసం నిరుద్యోగులతో కలిసి తెలుగు యువత అనేక పోరాటాలు చేసినప్పటికీ గత ప్రభుత్వం స్పందించలేదని ఆయన తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 16,347 పోస్టులతో మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం పెట్టడం ద్వారా తమ పోరాటానికి ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు మంచి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదు హామీలపై సంతకం చేయడం సంతోషదాయకమన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అంకాలగూడెం గ్రామంలో సొంగ శేఖర్ తాటాకిల్లు గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి మానవతా కొయ్యలగూడెం శాఖ ద్వారా రూ.మూడు వేలు, మానవతా సభ్యులు ముప్పనపల్లి వెంకటేశ్వరరావు రూ.500 మొత్తం రూ.3,500 అందించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు బొమ్మ మోహన్, కోశాధికారి రామకృష్ణ, నాగేశ్వరరావు, మామిడి మోహన్, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలికకు వివాహం

తల్లిదండ్రులు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బాలికకు వివాహం చేసిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి వారిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ ప్రాంతానికి చెందిన బాలిక బాలుడు ప్రేమించుకున్నారు. వీరిద్దరు శారీరకంగా ఒకటవ్వడంతో గతేడాది ఆగస్టు నెలలో బాలిక గర్భం దాల్చింది. బాలుడు, బాలిక తల్లిదండ్రులిద్దరు ప్రజల సమక్షంలో మాట్లాడుకుని వారిద్దరికి వివాహం చేయాలని నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది గ్రామ మహిళా కార్యదర్శులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక, బాలుడికి వివాహం చేయబోమని తల్లిదండ్రుల వద్ద హామీ తీసుకుంటూ పత్రాన్ని కూడా రాయించుకున్నారు. అయితే ఇరువురు తల్లిదండ్రులు కలిసి వారికి రెండు రోజుల తర్వాత ఆగస్టు 29వ తేదీన వివాహం జరిపించారు. వివాహం జరిగిన అనంతరం విషయాన్ని తెలుసుకున్న ఐసిడిఎస్ సిబ్బంది ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఒకటో పట్టణ సిఐ రాజశేఖర్ ఈ కేసులో తల్లిదండ్రులను శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఏలూరు ప్రభుత్వాసుపత్రి

ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో ఎంఎల్ఎ బడేటి చంటి

రక్తదాతలను అభినందిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆరోగ్యవంతమైన ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి) తెలిపారు. స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ రక్తదానం అంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తాన్ని సేకరించి ప్రాణాపాయంలో ఉన్నవారికి సేవలందించడంలో భాగస్వాములవుతున్న ప్రతిఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలుమార్లు రక్తదానం చేసిన రక్తదాతలను ఎంఎల్ఎ బడేటి చంటి ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛంద రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడే రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపే అవకాశమే ప్రపంచ రక్తదాత దినోత్సవం జరుపుకునే ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ప్రతినెలా రూ.25 వేలు విరాళంగా ఇస్తున్న అడుసుమిల్లి సుబ్రహ్మణ్యాన్ని అభినందించారు. ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రిని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అవసరమైన నిధులను తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఏలూరు ప్రజలు తమపై ఎంతో విశ్వాసంతో ఉంచిన బాధ్యతను అంకితభావంతో 24 గంటలు ప్రజలకు మెరుగైన సేవలందించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. తొలుత రెడ్‌క్రాస్ ఆవరణలో మొక్కలు నాటి, రక్తదాన సేకరణ మొబైల్ వాహనంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రెడ్ క్రాస్ సేవల్లో భాగస్వాములైన పలువురు దాతలను, అధికారులను, సిబ్బందిని ఆయన సత్కరించి మెమొంటోను అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట, సూపరింటెండెంట్ విజయ, డిసిహెచ్ పాల్ సతీష్, ఆలపాటి నాగేశ్వరరావు, నిర్మల, ఆర్ఎస్ఆర్ మాస్టర్ కృష్ణారావు, డాక్టర్ వరప్రసాద్, హౌసింగ్ డిఎం రవికుమార్, సెట్‌వెల్ సిఇఒ మెహ్రాజ్, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు, పలువురు డాక్టర్లు, దాతలు, సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోట : రక్తదానం చేయటం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ మధు కోరారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తున్న రక్తదాతలందరికీ అభినందనలు తెలిపారు. గడిచిన నాలుగు రోజుల్లో సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు నలుగురు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా సుదూర ప్రాంతాలకు సైతం వెళ్లి రక్తం అవసరమైన వారికి రక్తం అందించనున్నట్లు చెప్పారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షులు మున్నంగి శ్రీనివాస్ విజయవాడలో, మున్నంగి సాయి మణికంఠ ద్వారకాతిరుమలలో, వీరమల్ల నితిన్ సాయి, వీరమల్ల సౌజన్ సాయి జంగారెడ్డిగూడెంలో ప్రాణాపాయ స్థితిలో, ఆపరేషన్ నిమిత్తం, డయాలసిస్ నిమిత్తం అవసరమైన వారికి రక్తం ఇచ్చారన్నారు.

యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళిక

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, యువత తమ వ్యక్తిగత సమాచారం తమ కార్యాలయంలో ఇవ్వాలని చెప్పారు. పరిశ్రమలు తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రహదారులు మరమ్మతులు నిర్వహించేందుకు కలెక్టర్‌తో సమావేశం నిర్వహించామని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పార్లమెంట్ సమావేశాల్లో ఆయిల్ పామ్ రైతుల సమస్యలు లేవనెత్తుతామని చెప్పారు.

కామవరపుకోట :మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీలో ఉన్న దుర్గ మల్లేశ్వరస్వామిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ, తాడిచర్ల గ్రామ పంచాయతీ సర్పంచి పసుమర్తి పార్థసారథి పాల్గొన్నారు.

ఎంపీ మహేష్‌యాదవ్‌ని కలిసిన ప్రగడపల్లి సర్పంచి

పోలవరం :ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌ని పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామ సర్పంచి కలుం బాపిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరులో శుక్రవారం కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద నుంచి ప్రచారజాత కళాకారుల డప్పులతో, నృత్యాలతో త్రినాథ్ ఫ్యాషన్స్, ఆర్ఆర్.పేట పార్క్, జివి.మాల్ మీదుగా ప్రభుత్వాసుపత్రి వరకు ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని ఈ మహాసభల్లో చర్చిస్తారని చెప్పారు. ఈ మహాసభలో రాష్ట్ర నలుమూలల నుంచి వేల మంది రైతు కూలిలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు పాల్గొంటారని తెలిపారు.

కొయ్యలగూడెంలో 'బడిబాట'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఐసిడిఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు పరిధిలో, కొయ్యలగూడెం సెక్టార్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లు నిండిన ప్రీ స్కూల్ పిల్లలకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. మేధా అభివృద్ధి, శారీరక అభివృద్ధి, గణిత అభివృద్ధి, సృజనాత్మక అభివృద్ధి వంటి వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి యుఎన్.స్వర్ణకుమరి, ఐటిసి జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణ ఆధ్వర్యంలో 25 మంది పిల్లలకు పిపి1, పిపి2 నుంచి ప్రమోట్ అయ్యి ప్రాథమిక పాఠశాలలో జాయిన్ అవ్వడానికి సర్టిఫికెట్లు అందించారు.

నేటి నుంచి పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నోటు, రాత పుస్తకాలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఇఒ-2 శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 5,485 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ 52 వేల పుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకూ 32 వేలు పుస్తకాలు వచ్చాయన్నారు. మిగతా పుస్తకాలు తాడేపల్లిగూడెం బుక్ డిపో నుంచి రావాల్సి ఉన్నాయని చెప్పారు. ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేయనున్నామని తెలిపారు.

గిరిజన రైతులకు వరి విత్తనాలు పంపిణీ

రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి రైతు భరోసా కేంద్రంలో 90 శాతం రాయితీతో వరి విత్తనాలను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చేతులమీదుగా శుక్రవారం గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా రైతులకు వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. మండలంలోని కామయ్యపాలెం, జీలుగుమిల్లి, రాచన్నగూడెం, రైతు భరోసా కేంద్రాల్లో ఎంటియు 1064, ఎంటియు 1061, రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. రెండు రోజుల్లో మిగిలిన రైతు భరోసా కేంద్రాలకు కూడా విత్తనాలు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పిజి.బుజ్జిబాబు, సొసైటీ కార్యదర్శి పి.కృష్ణమోహన్, జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, ఎస్.సత్యనారాయణరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు దుర్గ, రాములమ్మ, లావణ్య పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

ప్రజాశక్తి - ఏలూరు

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై ఐలు ఉమ్మడి పశ్చిమగోదావరి గోదావరి జిల్లా అధ్యక్షులు వి.శైలజ, ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి జిల్లా కమిటీ తరపున హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రెండో సంతకంగా ఈ చట్టాన్ని రద్దు చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రజల స్థిరాస్తుల హక్కులకు భంగం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వైసిపి హయాంలో జగన్ అమల్లోకి తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్, న్యాయవాదులు ఆధ్వర్యంలో రాష్ట్రంలో నాలుగు మాసాలు కోర్టు విధులను బహిష్కరించి అనేక రూపాల్లో ఆందోళనలు చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఈ చట్టాన్ని రద్దు చేస్తామని న్యాయవాదులకు, ప్రజలకు వాగ్దానం చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకొచ్చిన వెంటనే రద్దు చేయడం న్యాయవాదులు, ప్రజల ఆస్తుల రక్షణకు చట్టం రద్దు ఒక నిదర్శమన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం నిధిని కేటాయించాలని కోరారు.

ఏలూరు అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేయటాన్ని రైతు సంఘం జిల్లా కమిటీ ఆహ్వానిస్తుందని, హర్షం వ్యక్తం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నరసింహ, కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, గతేడాది రాష్ట్రంలో ఏర్పడ్డ కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు, ఖరీఫ్ పంటలు పెట్టుబడుల కోసం తీవ్రమైన ఆందోళనతో ఉన్నారని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా పంట పెట్టుబడుల కోసం రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు పంట పెట్టుబడి సహాయాన్ని అందించాలని కోరారు.

నూజివీడు టౌన్ : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు సంతకం చేసిన చంద్రబాబునాయుడుకు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో శుక్రవారం బ్యానర్ కట్టి స్వీట్లు పంచిపెట్టారు.

ప్రజా సమస్యలపై పోరాటం : సిపిఐ

జంగారెడ్డిగూడెం టౌన్ :గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి సిపిఐ శ్రేణులు ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం పెడసనగంటి బాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణచైతన్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇండియా వేదిక గట్టి పోటీ ఇచ్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడతారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో సిపిఐ శాఖలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు, మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, మండల కౌన్సిల్ సభ్యులు గొలిమె బాల యేసు, తాళ్లూరి నాగరాజు, చిలంతరాజుల శ్రీను, కలపాల శ్రీరాములు, చందా త్రిమూర్తులు, బత్తిన పెద అప్పలరాజు, జగన్నాథ లక్ష్మణరావు, మంచెల ప్రభాకర్, చాకిరీ సురేష్ పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని ప్రభుత్వ వసతి గృహాల్లో శుక్రవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. వేసవి సెలవుల అనంతరం కళాశాలలు, పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో వసతి గృహాలను శుభ్రపరుస్తూ, దోమల నిర్మూలన మందును పిచికారీ చేశారు. ఎస్‌సి బాలుర, బిసి బాలుర, ఎస్‌సి బాలికల వసతి గృహాల్లో పంచాయతీ నిధులతో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైద్య ఆరోగ్యశాఖ కైకలూరు యూనిట్ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ముదినేపల్లి :ముదినేపల్లికి చెందిన షేక్ షఫీ కుమార్తె షేక్ షబీన పదో తరగతి పూర్తి చేసుకొని ఇంటర్ చదివేందుకు బొర్రా బాలసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, కొడాలి వినోద్ సహకారంతో విద్యార్థినికి రూ.పది వేలు ఆర్థిక సాయం ముస్లిం సోదరుల చేతుల మీదుగా షబీనకు అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ నూరేళ్ల, మొహమ్మద్ రియాజ్, షేక్ ఇస్మాయిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాదాయ-ధర్మాదాయ శాఖ
భూములు కౌలు హక్కునకు టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, తేతలి గ్రామంలో వేంచేసియున్న శ్రీరాజేశ్వరస్వామి వారి దేవస్థానం సంపూర్ణ హక్కు భుక్తములోని య.4.79 సెంట్ల భూమిని ఈ క్రింది తెలియపరచిన విధముగా ప్రతులుగా శ్రీ స్వామి వారి ఆలయము నందు ది.26.06.2024వ తేదీ ఉదయం గం.10.00లకు కౌలు హక్కునకు 3 సం॥లకు అనగా 2024-2025 సం॥ము నుండి 2026-2027 సం॥ము వరకు బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు ఆయా ప్రతులకు నిర్ణయింపబడిన ప్రకారము ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. పాట షరతులు, వివరములు పాట కాలమందు చదివి వినిపించబడును. లేదా ముందుగా దేవస్థానం కార్యాలయము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	గ్రామము	ఆర్.ఎస్.నెం.	భూమి విస్తీర్ణం య.సెం	ప్రథమ ధరావత్తు
1.	తేతలి	312/4	4.07	8000
2.	తేతలి	175/1	0.32	1000
3.	దువ్వ	779/2	0.40	1000

స్థలం : తేతలి
తేది : 15.06.2024
ఇట్లు
ఫౌండరు ఫ్యామిలీ మెంబరు, శ్రీరాజేశ్వరస్వామి దేవస్థానం

పెన్షన్ పెంపుపై హర్షం

ప్రజాశక్తి - కామవరపుకోట

రాష్ట్రంలో అధికారం చేపట్టిన టిడిపి కూటమి వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, గీత కార్మికులకు, రంగస్థల కళాకారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.మూడు వేలు పెన్షన్‌ను అదనంగా మరొక రూ.వెయ్యి పెంచి నెలకు రూ.నాలుగు వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించడంపై ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు సభ్యులు కనకరాజు, ఏలూరు జిల్లా ప్రజానాట్యమండలి సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు హర్షం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఒక ఏడాది తర్వాత వృద్ధ కళాకారులకు రూ.ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిమ్మలకు శ్రీనివాస్ అభినందన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలకొల్లు ఎంఎల్ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడును జలవనరుల శాఖ మంత్రిగా నియమించిన సందర్భంగా రాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రభుత్వ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని, తద్వారా రాష్ట్ర ప్రగతిలో తామంతా భాగస్వామ్యంగా ఉండాలని ఆశిస్తున్నామని తెలిపారు. జలవనరుల శాఖలో పని చేస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు, లస్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 334/2023

బిట్వీన్:
శ్రీమతి యాళ్ళ విమల -వాది
మరియు
శ్రీ యాళ్ళ రాము మరియు యితరులు -ప్రతివాదులు

3వ ప్రతివాది: శ్రీమతి గాతం లీలాకుమారి, భర్త: శ్రీ దాసు, ఎస్.సి. కాలనీ, అడవికొలను గ్రామం, నిడమర్రు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధంలో శ్రీ కోర్టు వారి ద్వారా 3వ ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు **ది. 18-06-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
తేది:13-6-2024 సెల్: 9290188928

ప్రకటన
డాక్యుమెంట్ పోయినది

నా క్లయింటు ఆకుల రేణుక సత్య అనుపమ, భర్త: ఆకుల వీరాంజనేయులు, అత్తిలి మండలం, బల్లిపాడు గ్రామము, డోర్ నెం. 2-42రు కాపురస్తురాలు వారిచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ అయిన ఆకుల రేణు సత్య అనుపమ, భర్త: ఆకుల వీరాంజనేయులు నా క్లయింట్‌కు గల శ్రీ తణుకు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు వారి పరిధిలో లింక్ దస్తావేజు నెం. 3161/1991 రుగా ది. 12-08-1999 తేదీన రిజిస్ట్రేషన్ కాబడి తణుకు మండలం, తణుకు పట్టణం, టి-వేమవరం, ఆర్.ఎస్. నెం. 54/6రు దాఖలా చ॥గ॥ 246-12లు ఖాళీ నివేశ్న స్థలమును గురించి అనగా సదరు లింక్ దస్తావేజు జిరాక్స్ కావలసియుండి ది. 18-05-2024వ తేదీ సాయంత్రం సుమారు గం॥ 4.00ల సమయములో ఆమె యింటి వద్ద నుండి అనగా బల్లిపాడు నుండి అత్తిలి జిరాక్స్ షాపునకు లింక్ దస్తావేజును తీసుకొని ఆటోలో వెళ్ళి వస్తుండగా దస్తావేజు పెట్టుకున్న కవర్ పోయినది. ఆ కవర్‌లో లింక్ డాక్యుమెంట్ (ఒరిజినల్) ఉన్నది. నా క్లయింట్ జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళి చూచుకొనగా దారిలో దొరకలేదు. నా క్లయింట్ వచ్చిన దారినే మరలా వెనక్కి వెళ్ళి వెదికినది. కాని నా లింక్ డాక్యుమెంట్ పెట్టుకున్న కవర్ దొరకలేదు.

కావున ఏవన్నందికి తెలియజేయునది ఏమనగా సదరు పైన తెలిపిన లింక్ ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింద తెలిపిన నా క్లయింట్ అడ్రస్‌కు గాని, నాకు గాని తెలియజేయ ప్రార్ధన.

నా క్లయింట్ చిరునామా:
ఆకుల రేణుక సత్య అనుపమ, C/o. వీర రాఘవులు, పంచాయతి ఆఫీస్ రోడ్, బల్లిపాడు గ్రామము, అత్తిలి మండలం, ప॥గో॥జిల్లా, సెల్: 9849120270

చింతపల్లి నాగేశ్వరరావు
అడ్వకేట్ అండ్ నోటరీ
తణుకు మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 9949476923

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.29/2022

బిట్వీన్:
రైతు డిపోట్ ఫెర్టిలైజర్స్ హోల్ సేల్ & రిటైల్ ప్రొ: చిన్ని లక్ష్మీనారాయణ. ...వాది
అండ్
1) మురళి కృష్ణ ట్రేడర్స్, ప్రొ: కలగర మురళీకృష్ణ.
2) కలగర మురళీ కృష్ణ. ...ప్రతివాదులు

ప్రతివాదులు:
1) మురళీ కృష్ణ ట్రేడర్స్, డో.నెం.1/49, మెయిన్ రోడ్, లింగపాలెం మండలం, ములగలంపాడు - 534462, ప॥గో॥జిల్లా /ఏలూరు జిల్లా, ఆం॥ప్ర॥.
2) కలగర మురళీ కృష్ణ, తండ్రి: భాస్కరరావు, లింగపాలెం మండలం, ములగలంపాడు - 534462, ప॥గో॥జిల్లా /ఏలూరు జిల్లా, ఆం॥ప్ర॥.

పై నెంబరు గ్రంధమునందు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపియున్ననూ సదరు నోటీసును ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారంమీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు పై గ్రంధములో సదరుపై గ్రంధములో ది.20-06-2024 వాయిదా తేదీ అయి ఉన్నది. కావున సదరు వాయిదాకు మీరు గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.20-06-2024వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

మేడిది చిన్న కృష్ణమాచార్యులు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 70360 76151